క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జిల్లెలగూడ ఫీడర్ పరిధిలోని మంద మల్లమ్మ ఎక్స్‌రోడ్డు–టీకేఆర్ కమాన్, శక్తినగర్, అంబేడ్కర్‌నగర్, గాయత్రీనగర్, న్యూ గాయత్రీనగర్, ఓల్డ్ గాయత్రీనగర్, డీఆర్ఆర్ హోమ్స్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ జనార్ధన్‌రెడ్డి ఫీడర్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్, గాయత్రీనగర్, శ్రీధర్‌కాలనీ, వివేక్‌నగర్, వెంకటేశ్వరకాలనీ, హనుమాన్‌నగర్‌లో మధ్యాహ్నం 12.30 నుంచి 1 గంటవరకు. 11కేవీ కేశవరెడ్డి ఫీడర్ పరిధిలోని టీఎస్ఆర్‌నగర్, ప్రశాంతి హిల్స్ రోడ్–1, 2, రాఘవేంద్రనగర్, మీర్‌పేట పోస్టాఫీసు, మీర్‌పేట పోలీస్‌స్టేషన్, సీతాహోమ్స్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయబడుతుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పహాడీషరీఫ్‌లో..

పహాడీషరీఫ్: జల్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు బస్తీలలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పహాడీషరీఫ్ ఏఈ ఎల్.వీ.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జల్‌పల్లి, శ్రీరాంకాలనీ, రిలయన్స్ కాలనీ, అద్నాన్ కాలనీ, మామిడిపల్లి, సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్, జీఎంఆర్ టౌన్‌షిప్, ఆర్.ఆర్.మసాల ఏరియా, గౌస్ నగర్, నూరీనగర్, లేక్ వ్యూహిల్స్, హుందా హిల్స్, అహ్మద్ నగర్, ఇస్మాయిల్‌నగర్‌లలో అంతరాయం కలగడాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఈటలను కలిసిన నాయకులు



ఎంపీ ఈటలను సత్కరిస్తున్న నాయకులు

మీర్‌పేట: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మీర్‌పేటకు చెందిన బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు ఆదివారం పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎంపీ ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేయాలని ఆయన సూచించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎంపీని శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎడ్ల మల్లేశ్ ముదిరాజ్, గౌరీశంకర్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని మారుతీనగర్ కాలనీలోని రోడ్ నెంబర్ 7లో ఆదివారం ఉమా ఐ కేర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న ప్రజలకు ఉచిత కంటి పరీక్షలతో పాటు దూరం, దగ్గర చూపులు మందగించిన వారిక ప్రత్యేక టెస్టులు చేసి మందులతో పాటు కంటి అద్దాలు అందచేశారు. సైదులు, శ్రీనివాస్, దత్తు, సతీశ్, మహేశ్, సాయి, పీవీఆర్, రతన్, రాందాస్, శ్రీధర్, కాలనీవాసులు ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మహేశ్వరం: తుక్కుగూడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో దళిత ప్రధానోపాధ్యాయుడు కంబలి రాములుపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (పీడీఎస్ఎఫ్) రాష్ట్ర నాయకులు మరికంటి హరీశ్, కోట ఆనంద్ ప్రభుత్వాన్ని ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డిసెంబర్ 23న మండలంలోని తుక్కుగూడ బాలుర ఉన్నత పాఠశాలలో దళిత ప్రధానోపాధ్యాయుడిపై కొంత మంది కులోన్మాదులు ఉద్దేశపూర్వకంగా దాడికి పాల్పడి, విద్యార్థి కాళ్లు మొక్కించిన అవమానించిన ఘటన సమాజంలో బహిరంగ కుల వివక్ష అమలుకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దాడి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కడ్తాల్: మండల పరిధి టాక్‌రాజ్‌గూడతండాలో నిర్మిస్తున్న జగదాంబ మాత దేవాలయం నిర్మాణానికి గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ రూ.51 వేలు, స్థానిక నాయకులు ముత్తి కృష్ణ రూ.15 వేలు విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఆలయ నిర్వాహకులకు విరాళం అందజేశారు.

వంతెన చింత తీరేదెలా?

వర్షాకాలం వచ్చిందంటే ఈ మార్గం గుండా ఏడాదిలో మూడోవంతు రోజులు వాహనాలు పరుగు తీయలేవు. రైతులు పొలాలకు వెళ్లలేరు. చుట్టూ తిరిగిపోవాలంటే దూరభారంతో పాటు.. సమయం వృథా అవుతోందని, కుంట వద్ద వంతెన నిర్మిస్తే రవాణా కష్టాలు తీరుతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

వర్షాకాలంలో బైపాస్ రోడ్డు బంద్

- జలదిగ్బంధంలో మొగుళ్ల వంపు కుంట మార్గం
- రాకపోకలకు తీవ్ర ఆటంకం
- పొలాలకు వెళ్లలేక పోతున్న రైతులు
- బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న ప్రజలు



నీరు తగ్గడంతో కనబడుతున్న మొగుళ్ల వంపు కుంట మార్గం(బైపాస్ రోడ్డు)

ఇబ్రహీంపట్నం: హైదరాబాద్– నాగార్జునసాగర్ ప్రధాన రహదారులను కలిపే బైపాస్ రోడ్డుపై వంతెన నిర్మాణం కోసం ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇబ్రహీంపట్నం నుంచి నాగన్‌పల్లికి వెళ్లే దారిలో శ్రీ సంగమేశ్వర అలయం సమీపాన మొగుళ్లవంపు కుంట ఉంది. నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు నాగార్జునసాగర్ నుంచి కుంట పక్క నుంచి ప్రత్యేకంగా రోడ్డు వేసి కృష్ణ జలాల పైపులైన్లను తీశారు. కుంట పక్క నుంచే రహదారి ఉండటంతో వానాకాలంలో కుంట నిండి రోడ్డును ముంచేస్తుంది. ఏటా వర్షాలు కురిసిన ప్రతిసారి రోడ్డుపై నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఇలా ప్రతి సంవత్సరం మూడు, నాలుగు నెలల మాత్రమే ఈ మార్గంలో వాహనాలు పరుగు తీస్తుంటాయి. మిగతా కాలంలో చుట్టూ తిరిగిపోవాల్సి ఉంటుంది. పైపులైన్, రోడ్డు నిర్మాణ సమయంలో ఇక్కడ వంతెన నిర్మించి ఉంటే ఈ పరిస్థితులు ఉత్పన్నం అయ్యేవి కావని ప్రాంత ప్రజల అభిప్రాయం.

నీరు తగ్గితేనే రాకపోకలు

ఖానాపూర్ గ్రామ సమీపం నుంచి కోహెడ క్రాస్ రోడ్డు వరకు ఈ దారి ఉంటుంది. ఇబ్రహీంపట్నం టౌన్‌లోకి వెళ్లకుండా నాగన్‌పల్లి, ఖానాపూర్, పొల్కంపల్లి, దండుమైలారం, ముకునూర్ గ్రామాల నుంచి నిత్యం ప్రయాణం సాగించేవారికి బైపాస్ దారి ఎంతగానో ఉపయోగపడుతుంది. వానాకాలంలో రోడ్డుపై నీరు నిలిచి రాకపోకలు ఆటంకం కలుగుతుంది. నీరు తగ్గిన తరువాత రోడ్డు స్పష్టంగా కనబడుతుంది. ఆ తరువాతే రాకపోకలకు కొనసాగుతాయి.

తగ్గనున్న దూరభారం

నాగార్జునసాగర్– హైదరాబాద్ ప్రధాన రహదారులపైకి వెళ్లాలంటే ఈ మార్గం గుండా ప్రయాణిస్తే.. దూరభారం తగ్గుతుందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఈ రోడ్డులో కుంట వద్ద వంతెన నిర్మిస్తే రవాణామార్గం సులువుగా ఉండటంతో పాటు.. ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. రవాణా, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని, ఆ దిశగా జలమండలి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

సాహసం ప్రమాదం

మొగుళ్లవంపు కుంట మార్గంలో నీరు నిలిచిన రోజుల్లో వాహనాల రాకపోకలే కాదు.. ప్రాంత రైతులు తమ పొలాలకు వెళ్లాలన్నా ఇబ్బంది కరమే. ఈ సమయంలో సాహసం చేసి వెళ్లిన వాహనదారులు ప్రమాదంలో చిక్కుకున్న ఘటనలు ఉన్నాయి. ఏడాది క్రితం దండుమైలారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కుటుంబ సభ్యులతో కారులో వెళ్తూ నీటిలో చిక్కుకున్నారు. గమనించిన స్థానికులు కారు డోర్లు తెరిచి వారిని కాపాడారు.



నీటిలో చిక్కుకున్న కారు(ఫైల్)

అందరికీ అనుకూలం



మొగుళ్లవంపు కుంట పక్క నుంచి వెళ్లే రోడ్డు అందరికీ అనుకూలంగా ఉంది. పట్నంలోకి వెళ్లకుండా ఈ మార్గం గుండా హైవే రోడ్డు తదితర ప్రాంతాలకు వెళ్లేవారికి దూరభారం తగ్గుతుంది. అలాంటి ఈ మార్గంలోని కుంట వద్ద బ్రిడ్జి లేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వంతెన నిర్మిస్తే రవాణా కష్టాలు తీరుతాయి.

– మాచర్ల శంకర్, ఇబ్రహీంపట్నం

పొలాలకు వెళ్లలేకపోతున్నాం



వానాకాలంలో కుంట రోడ్డు వద్ద నీరు నిలిచి రాకపోకలు ఇబ్బందిగా మారుతోంది. ఈ మార్గం గుండా వ్యవసాయ బావులకు వెళ్లలేక పోతున్నం. చుట్టూ తిరిగి పోవాలంటే కష్టంగా ఉంది. కృష్ణా జలాల పైపులైన్ రోడ్డు కోసం భూములు ఇచ్చినం. ఇప్పుడు మా పొలాలకు వెళ్లలేకపోతున్నం. బ్రిడ్జి నిర్మిస్తే అందరికీ మేలు.

– నాగిళ్ల అశోక్, రైతు, ఇబ్రహీంపట్నం

ఘనంగా అయ్యప్ప పడిపూజ

హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి



పడిపూజలో పాల్గొన్న కావ్యారెడ్డి, అందెల శ్రీరాములు

కందుకూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో ఆదివారం అయ్యప్ప మహాపడి పూజ, ఇరుముడి పూజను ఘనంగా నిర్వహించారు. గురుస్వామి రుద్రుపాల రాము ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరుముళ్లతో స్వాములు శబరియాత్రకు తరలి వెళ్లారు. కాగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డితో పాటు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కావ్యారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని వేడుకున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మంద జ్యోతి పాండు, సీనియర్ నాయకులు జి.అమరేందర్‌రెడ్డి, భిక్షపతి, రాజేందర్‌రెడ్డి, ఢిల్లీ వెంకటేశ్‌ముదిరాజ్, చిందం మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో నాయకులు

ఆమనగల్లు: విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు అన్నారు. మున్సిపాలిటీ పరిధి నుచ్చుగుట్టతండాలో ఎంపీఎల్ క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అందులో భాగంగానే క్రీడాపాలసీని రూపొందించి క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని, తమ ప్రతిభ చూపి, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కుమార్, పీర్యానాయక్, టోర్నీ నిర్వాహకులు సంతోష్, రాజేశ్, కుమార్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే బీజేపీ ధ్యేయం

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి విష్ణువర్ధన్‌రెడ్డి కండువాలు కప్పి స్వాగతం పలికారు. అదేవిధంగా గ్రామంలోని రెండు పోలింగ్ బూత్‌లకు పార్టీ అధ్యక్షులుగా రాఘవేందర్, హరీశ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రధాని మోదీ దేశాభివృద్ధికి, దేశ రక్షణ కోసం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక పథకాలను రూపొందించి విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. అర్హులైన వారికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. తద్వారా గ్రామస్థాయిలో పార్టీ బలోపేతమవుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు సత్తా చాటాలన్నారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు శివరాజ్, రాఘవేందర్, ప్రసాద్, శశి, రాజు, హరీశ్, అభి, వంశీ, నవీన్, ఆనంద్, గణేశ్, అరవింద్, వసంత్, తరుణ్, హర్షిత్, పాండు, అనిల్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

బూత్ కమిటీ నియామకం

కడ్తాల్: గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీశైలం గౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధి సాలార్‌పూర్ గ్రామంలో పార్టీ 10వ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో కమిటీ నూతన అధ్యక్షుడిగా నేనావత్ దస్రునాయక్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం చేపడుతున్న సంక్షేమాభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. అనంతరం దస్రునాయక్‌కు నియామకపత్రం అందజేసి, సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీమోర్చా మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నాయకులు తావుర్యా, అనిల్, వినోద్, ఈశ్వర్, శివ, జగన్ తదితరులు ఉన్నారు.

ఇష్టారాజ్యంగా వైన్స్‌ల నిర్వహణ

సామాన్యులకు తప్పని తిప్పలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీ వైన్స్ ఎదుట రోడ్డులో సాధారణ వాహనదారులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. గోడౌన్ నుంచి మద్యం బాటిళ్ల లోడ్‌తో వచ్చిన వాహనాన్ని వైన్స్ ఎదుట రోడ్డుపై సగం వరకు నిలిపి లోడ్‌ను దించుతుండడంతో వాంబే కాలనీ–శ్రీరాం కాలనీ రూట్‌లో ప్రయాణించే వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. శనివారం రాత్రి ఇలా నిలిపిన వాహనంతో ఈ మార్గంలో పెద్దఎత్తున ట్రాఫిక్ స్తంభించడంతో వాహన చోదకులు చీకట్లో అవస్థలు పడ్డారు. ఇలా రోడ్డుపై వాహనాన్ని ఎలా నిలుపుతారని ఓ వాహనదారుడు అడగగా.. వైన్స్ సిబ్బంది సదరు వ్యక్తిపై దురుసుగా ప్రవర్తించారు. దీనికి తోడు మందుబాబులు ఆరుబయటే మద్యం సేవిస్తూ, బాటిళ్లను పగులకొడుతుండడంతో పక్కనే పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు. ఈ విషయంలో స్థానిక పహాడీషరీఫ్ పోలీసులు, సరూర్‌నగర్ ఎక్సైజ్ అధికారులు స్పందించి సామాన్యులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన నియామకం



లచ్చిరాం

తుర్కయంజాల్: సేవాలాల్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ మునగనూర్, తొర్రూర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉదావత్ లచ్చిరాంను నియమించినట్లు అధ్యక్షుడు సూర్య రాథోడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా లచ్చిరాం మాట్లాడుతూ, బంజారా జాతి అభ్యున్నతికి, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే సబితారెడ్డి



అయ్యప్ప ఇరుముడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి, నాయకులు

మహేశ్వరం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పెండ్యాల గ్రామంలో అయ్యప్ప ఇరుముడి పూజ కార్యక్రమానికి ఆమె హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజు కొంత సమయాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి రోజు ధ్యానం, భక్తి కార్యక్రమాలు చేస్తే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. అంతకుముందు అయ్యప్ప భక్తులు ఇరుముడి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించి ఇరుముడులతో శబరిమలకు బయలుదేరారు. ఎమ్మెల్యే సబితారెడ్డిని అయ్యప్ప భక్తులు, స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి, పెండ్యాల మాజీ సర్పంచ్ సంధ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అంబయ్యయాదవ్, మంత్రి రాజేశ్, ఫకీరా తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



జెండా ఆవిష్కరిస్తున్న రామస్వామి, నాయకులు

మొయినాబాద్: నల్గొండలో నిర్వహించే పార్టీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండలంలోని పెద్ద మంగళారం గ్రామంలో ఆదివారం పార్టీ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పేదప్రజలు, కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తోందని తెలిపారు. రైతాంగ సాయుధ పోరాటంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. సుమారు పది లక్షల ఎకరాల భూమి పేదలకు పంచి, 4వేల గ్రామాలను వెట్టిచాకిరి నుంచి విముక్తి చేయించినట్లు వెల్లడించారు. ఈ నెల 30వ తేదీన నల్గొండలో నిర్వహించే బహిరంగ సభలో కార్మికులు, కర్షకులు, రైతులు, ప్రజాసంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ సీనియర్ నాయకుడు ఎం.ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, నాయకులు సత్తయ్య, వెంకటయ్య, మల్లేశ్, ఎ.శ్రీనివాస్, సుధాకర్‌గౌడ్, అంజయ్య, యాదగిరి, యశోద, లక్ష్మణ్, బాల్‌రాజ్, వెంకటేశ్, నర్సింలు తదితరులు ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



రవిచందర్ గుప్తాను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ ఆరోపించారు. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి మంగళ్‌పల్లి వార్డులో నిర్వహించిన పార్టీ సంస్థాగత ఎన్నికలో అధ్యక్షుడిగా రవిచందర్ గుప్తాను నియమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి కాలం చెల్లిందని, ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సరిగా నెరవేర్చలేదని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు తప్ప ఒరగబెట్టిందేమి లేదని, రుణమాఫీ పూర్తి చేయలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు లచ్చిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, పార్లమెంట్ కన్వీనర్ నారాయణయాదవ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాల్లో ఫార్మాసిటీ వద్దు



కుర్మిద్దలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యుల ర్యాలీ

- కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలుపుకోవాలి
- కాలుష్యంతో జీవకోటికి ముప్పు
- వ్యతిరేక పోరాట కమిటీ సభ్యురాలు సరస్వతి

యాచారం: 'రైతులు పంటలు పండించే భూముల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయొద్దు. ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తే.. రైతులు ఉపాధి కోల్పోతారు. కాలుష్యంతో జీవకోటికి ముప్పు కలగనుంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి' అని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యురాలు కవుల సరస్వతి అన్నారు. ఫార్మాసిటీ, పరిశ్రమల ద్వారా వెలువడే కాలుష్యం, తద్వారా కలిగే నష్టంపై ఆదివారం కుర్మిద్ద, మర్లకుంటతండాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని కాంగ్రెస్ పార్టీ పెద్దలు హామీ ఇచ్చారని, మాట మార్చి ఇప్పుడు అదే ప్రాంతంలో ఫార్మాసిటీ ఏర్పాటుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోని 2,500 ఎకరాలకు పైగా పట్టా భూమిని రైతులకు కనీస సమాచారం ఇవ్వకుండా భూరికార్డులను టీజీఐఐసీ పేరిట మార్చేశారని పేర్కొన్నారు. ఆ భూ రికార్డులను రైతుల పేరిట మార్చాలని ఆందోళన, ధర్నాలు చేసినా ఫలితం లేదని వాపోయారు. పైగా రైతులపై అక్రమ కేసులు పెట్టి భయాందోళనకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఫార్మాసిటీకి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు రైతులు, ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతులు నారాయణ, అచ్చిరెడ్డి, నిరంజన్, గణేశ్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఇంటిగ్రేటెడ్' పూర్తయ్యేనా!

- నిధులు లేక నిలిచిన పనులు
- మూడేళ్లు కావస్తున్నా పూర్తికాని వైనం



నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో రూ.4.50 కోట్ల వ్యయంతో వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ (సమీకృత) మార్కెట్ నిర్మాణ పనులు నిధులు లేక అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మూడేళ్లు కావస్తున్నా.. పిల్లర్లు, స్లాబ్ దశలోనే దర్శనమిస్తోంది. దీంతో ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న మార్కెట్ నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో వ్యాపారులు, స్థానికులు నిరుత్సాహం వ్యక్తంచేస్తున్నారు.

మార్కెట్ లేక ఇబ్బందులు

పట్టణంలో కూరగాయలు, మాంసం, చేపలు తదితర సరుకులు విక్రయించడానికి నిర్దిష్ట స్థలాలు లేవు. అంగడిబజార్, గాంధీచౌక్ తదితర ప్రాంతాల రోడ్లపైనే క్రయవిక్రయాలు కొనసాగుతుండటంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో రైతుబజారు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు, చిరువ్యాపారులు కోరారు. దీంతో 2021లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి నాటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

అట్టహాసంగా ముహూర్తం

మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో.. వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో 'ఇంటిగ్రేటెడ్' నిర్మాణానికి స్థలం కేటాయించారు. 2021 నవంబర్ 8న మార్కెట్ నిర్మాణానికి నాటి వ్యవసాయ శాఖామంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌లు అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. కానీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తేవడంతో గత ఏడాది పనులు మొదలు పెట్టారు. తొలుత ముమ్మరంగా సాగిన నిర్మాణ పనులు.. రెండు స్లాబులు, ఒకవైపు గోడలు నిర్మించి అర్ధాంతరంగా ఆపేశారు. సదరు కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతోనే పనులు ఆగినట్లు తెలుస్తోంది. అసంపూర్తి పనులను పూర్తిచేసి, మార్కెట్‌ను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.